ప్రచురణార్థమైన

భారత దేశ సర్వోన్నత న్యాయస్థానము
క్రిమినల్ అప్పీలేట్ అధికారపరిధి
క్రిమినల్ అప్పీలు సంఖ్య: 1548/2010

ఉప్పల భిక్షమ్ @భిక్షయ్య ... అప్పీలుదారుడు

మరియు

స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ... ప్రతివాది.

**తీర్పు**

భానుమతి, న్యాయమూర్తి.

1. ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానము హైదరాబాద్వారుతేది.03-07-2015నాడు క్రిమినల్ అప్పీలు సంఖ్య.479/2004 లో ఇచ్చిన తీర్పు మరియు ఉత్తర్వుల ప్రకారము ఐ.పి.సి. చట్టములోని విభాగము 302 మరియు విభాగము 201 ప్రకారము అప్పీలుదారుని దోషిగా నిర్ణయించి అతనికి యావజ్జీవ కారాగార శిక్షను విధించినందున ఈ అప్పీలు దాఖలు చేయబడినది.

2. ప్రాసిక్యూషన్ వారి వ్యాజ్యము ప్రకారము , మృతుడు రమేష్ ఒక గొర్రెల కాపరి , తన 19 గొర్రెలను తేదీ.27-01-2000 నాడు బీడిగూడెము గ్రామ శివార్లలో మేపుటకు తీసుకొని వెళ్ళి , తిరిగి రాలేదు. తేదీ 28-01-2000 నాడు పి.డబ్ల్యూ-1 మరియు అతని కుటుంబ సభ్యులు మృతుని కొరకు వెదుకు చుండగా , షేక్ నసీమ్ (పి.డబ్ల్యూ-9) వద్ద 3 గొర్రెలు దొరికినవి , షేక్ నసీమ్ అట్టి గొర్రెలను లింగయ్య(పి.డబ్ల్యూ-5) వద్ద కొనినట్లుగా చెప్పెను. లింగయ్యను (పి.డబ్ల్యూ-5) విచారించగా అప్పీలుదారుడు ఉప్పల భిక్షమ్ వాటిని 100 రూపాయలు బయానా తీసుకొని ,తనకు అమ్మినని చెప్పెను. తేది 29-01-2000 నాడు అప్పీలుదారుడు-ముద్దాయిని అరెస్టు చేసి ఐ.పి.సి. చట్టములోని విభాగము 379 ప్రకారము అతనిపై కేసు నమోదు చేసిరి. కేసు విచారణ సమయంలో అప్పీలుదారుడు నేరారోపణ చేయబడిన విధముగా , మృతుని తానే చంపెననినేరమునుఒప్పుకోనెను.తదుపరి ఐ.పి.సి. చట్టములోని విభాగము 302/201 ప్రకారము ముద్దాయికి వ్యతిరేకముగా కేసు నమోదు చేయబడినది. ప్రాసిక్యూషన్ వారి వ్యాజ్యము

అప్పీలుదారుడు – ముద్దాయి యొక్కఒప్పుకోలు వివరణ పై ఆధారపడినది , మరియు అట్టి ఒప్పుకోలు ప్రకారము మృతుని మృతదేహము చిన్న వంతెన క్రింద నుండి వెలికితీయబడినది.

3. సాక్ష్యాధారాలను పరిశీలించిన పిమ్మట మరి ముఖ్యముగా ముద్దాయి యొక్క ఒప్పుకోలు వివరణ ద్వారా గొర్రెలను స్వాధీనపర్చుకొనుట మరియు రమేష్ మృతదేహమును స్వాధీనపర్చుకొనుట ద్వారా, (అట్టి ఒప్పుకోలును క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ లోని విభాగము 313 క్రింద అప్పీలుదారుడు వ్యతిరేకించెను) ట్రయల్ కోర్టు ఐ.పి.సి. చట్టంలోని విభాగము 302 ప్రకారము అప్పీలుదారుని దోషిగా నిర్ణయించి , యావజ్జీవ కారాగార శిక్షను విధించెను , మరియు ఐ.పి.సి. చట్టంలోని విభాగము 201 ప్రకారము అప్పీలుదారునకు 6 నెలల పాటు కారాగార శిక్షను విధించెను. ట్రయల్ కోర్టు వారు దోషిగా నిర్ణయించిఅప్పీలుదారునికి విధించిన యావజ్జీవ కారాగార శిక్షను ఉన్నత న్యాయస్థానము స్థిరపరచెను.

4. కక్షిదారుల యొక్క ఇరుపక్షాల విజ్ఞులైన న్యాయవాదుల వాదనలు విన్నాము , మరియు వివాదాస్పద తీర్పును సాక్ష్యాధారాలను, రికార్డులో గల విషయములను పరిశీలించితిమి.

5. అప్పీలుదారుడు –ముద్దాయి యొక్క నేరమును రుజువు చేయుటకు ఈ పరిస్థితుల పై ఆధారపడిరి.

i. అప్పీలుదారుడు–ముద్దాయి చెప్పినందుననే రమేష్ యొక్క మృతదేహమును స్వాధీనపర్చుకొనిరి.

ii. అప్పీలుదారుడు –ముద్దాయి మూడు గొర్రెలను లింగయ్యకు (పి.డబ్లూ–5) అమ్మగా , లింగయ్య వాటిని షేక్ నసీమ్కు (పి.డబ్లూ–9)కు అమ్మెను. షేక్ నసీమ్ ను(పి.డబ్లూ–9) విచారించగా అతడు వాటిని లింగయ్య (పి.డబ్లూ–5) నుండి కొనుగోలు చేసెననియు , లింగయ్య వాటిని అప్పీలుదారుని వద్ద నుండి కొనెననియు మిగిలిన గొర్రెలను అప్పీలుదారుడు–ముద్దాయి యొక్క సోదరి (పి.డబ్లూ–8) ఇంటిలో ఉంచెననియు తెలిపెను.

6. ఒక కేసు పరిస్థితుల రీత్యా ,రుజువుల ఆధారముగా పరిష్కరించబడినపుడు అట్టి రుజువులు మూడు పరీక్షలను తృప్తిపరచవలెను. ఇది చక్కగా స్థిరపరచబడిన సూత్రము. ఆ మూడు పరీక్షలేవనగా :-

i) పరిస్థితులను ఆధారము చేసికొని , నేరము జరిగినదని అనుమానించినపుడు అట్టి అనుమానమును బలమైనదిగా ఉండుటయే గాక, అట్టి అనుమానమును నిరూపించవలెను.

ii) అట్టి పరిస్థితులు ముద్దాయి యొక్క నేరమును ఎత్తి చూపుటలో దోషరహితమై,ఖచ్చితమైన పోకడను కలిగి ఉండవలెను.

iii) మానవ శక్తి మేరకు ముద్దాయి తప్ప వేరెవరు ఈ నేరము చేసియుండరనెడి కృతనిశ్చయము నుండి తప్పించుకొనలేని విధముగా పరిస్థిలన్నియూ జోడింపబడి , ఒక గొలుసుగా ఏర్పడవలెను. ( ఎస్.డి.సోనీ వర్సెస్.స్టేట్ ఆఫ్ గుజరాత్ , (1992) ఎస్.యు.పి.పి 1 , ఎస్.సి.సి. 567 మరియు వెంకటేశన్ వర్సెస్, స్టేట్ ఆఫ్ తమిళనాడు(2008)8 ఎస్.సి.సి.456) ప్రకారము.

7. సవిస్తర రుజువులతో స్థిరపరచబడిన సూత్రముల వెలుగులో నిర్ధారణ చేయబడినవా లేదా అనియు పరిస్థితులన్నియు కలిసికట్టుగా ఒక పూర్తి గొలుసుగా ఏర్పడి ముద్దాయి యొక్క నేరమును నిర్ధారణ చేసినదీ, లేనిదీ ప్రాసిక్యూషన్ వారు పరిశీలన చేసుకొనవలెను.

8. నిజానికి, హత్య చేయుట వలన రమేష్ చనిపోయెను. అప్పీలుదారుడు-ముద్దాయి మూడు గొర్రెలను లింగయ్యకు (పి.డబ్ల్యూ-5) అమ్మిననియు , మరియు అట్టి గొర్రెలను అప్పీలుదారుడు-ముద్దాయి నుండి కొనుగోలు చేసెనని పి.డబ్ల్యూ-5 చెప్పిన సాక్ష్యము పైనే ప్రాసిక్యూషన్ వారు ముఖ్యముగా ఆధారపడిరి. ప్రాసిక్యూషన్ వారి కథనము ప్రకారము మూడు గొర్రెలు నేమ్మికల్ లోని షాండిలో దొరికినవి. అట్టి గొర్రెలు పి.డబ్ల్యూ-9 యొక్క స్వాధీనములోనున్నవి. పి.డబ్ల్యూ-9 ను విచారించగా, వాటిని తాను షేక్ నసీమ్ (పి.డబ్ల్యూ-5) నుండి కొనుగోలు చేసెనని చెప్పెను , మరియు షేక్ నసీమ్ పి.డబ్ల్యూ-5 అట్టి మూడు గొర్రెలను అప్పీలుదారుడు-ముద్దాయి నుండి కొనుగోలు చేసెనని చెప్పెను.గొర్రెలను స్వాధీనపర్చుకొనుటకు ప్రాసిక్యూషన్ వారుపి.డబ్ల్యూ-10 మరియు ఇతర సాక్షులను విచారించగా , అట్టి స్వాధీన పరచుకొనిన గొర్రెలకు ప్రత్యేక గుర్తింపు చిహ్నము లేదనియు కాబట్టి వాటిని కేసుకు సంబంధించిన గొర్రెలను గుర్తించలేమని అట్టి సాక్షులు తెలిపిరి. లింగయ్య పి.డబ్ల్యూ-5నుండి స్వాధీనపర్చుకొనిన గొర్రెలకు భిన్నమైన గుర్తింపు చిహ్నము కలదని గానీ , లేక అట్టి గొర్రెలు మృతుడు రమేష్ యొక్క గొర్రెలని చెప్పగల విషయమేదియు రికార్డు చేయబడలేదు. మరియు ప్రాసిక్యూషన్ వారు అప్పీలుదారుడు-ముద్దాయి యొక్క సోదరి ఇంటి నుండి గొర్రెలను స్వాధీనపర్చుకొనిన విషయము పై ఆధారపడిరి. ఇక్కడ కూడా , పి.డబ్ల్యూ-8 నుండి స్వాధీన పర్చుకొనిన గొర్రెలు మృతుడు రమేష్ కు చెందినవేనని గుర్తించుటకు వాటికి భిన్నమైన గుర్తుకలదని రుజువు చేసే విషయమేదియు రికార్డులో లేదు. కాబట్టి ఐ.పి.సి. చట్టములోని విభాగము 382 లోని నేరము నుండి అప్పీలుదారుని ట్రయల్ కోర్టు విడుదల చేసినది.

9. మృతుడు రమేష్ యొక్క శవమును అప్పీలుదారుడు-ముద్దాయి యొక్క ఒప్పుకోలు మూలముగానే స్వాధీనపర్చుకున్నందున మిగిలిన ఆ ఒక్క పరిస్థితి పైనే ప్రాసిక్యూషన్ వారు ఆధారపడిరి. మా ఆలోచన దృష్ట్యా ఈ ఒక్క పరిస్థితి మాత్రమే ముద్దాయి యొక్క నేరమును నిరూపించుకొనుటకు సరిపోదు. సి.ఆర్ .పి.సి.లోని విభాగము 313 రీత్యా అప్పీలుదారుని ప్రశ్నించినప్పుడు అప్పీలుదారుడు ఒప్పుకోలు వివరణ ఇచ్చిన విషయమును మరియు దాని

మూలముగానే మృతుడు రమేష్ యొక్క శవమును స్వాధీనపర్చుకొనేరనేడి విషయము వ్యతిరేకించెనని అప్పీలుదారుని తరపున తెలియచేసుకొనిరి. సంఘటన జరిగిన రెండు రోజుల తర్వాత మృతుడు రమేష్ యొక్క శవమును స్వాధీనపర్చుకొనుట వలన ప్రాసిక్యూషన్ వారి కేసు అనుమానమును రేకెత్తించుచున్నదని వాదనను కొనసాగించిరి.

10. ముద్దాయి ఒప్పుకోలు చేసినందుననే శవమును స్వాధీనపర్చుకొనిన పరిస్థితిని బట్టి, ముద్దాయి ఈ సంఘటనలో పాల్గొనెనని అనిపించవచ్చును. ఏదిఏమైనను , రాజకుమార్ సింగ్ ఎలియస్ రాజు ఎలియస్ బాట్యా వర్సెస్ స్టేట్ ఆఫ్ రాజస్తాన్ (2013) 5 ఎస్.సి.సి.722 కేసులో వ్యక్తపరచినట్లుగా , అనుమానము ఎంత గాఢమైనదైననూ , రుజువు యొక్క స్థానమును ఆక్రమించలేదు. "ఒకవేళ" మరియు "రూఢిగా" అను పదప్రయోగము మధ్య చాలా ఖాళీ లేదా తేడా కలదు. ప్రస్తుత కేసులో శవమును స్వాధీనము చేసుకొనిన పరిస్థితి వివాదాస్పద ఒప్పుకోలు వివరణ వలననే జరిగినదనెడి దానిపై తప్పుగా ఆధారపడినందున అప్పీలుదారుడు–ముద్దాయి ఈ సంఘటనలో పాల్గొనేననెడి అనుమానము ఒకవేళ కలగవచ్చును. కానీ , వట్టి అనుమానము మాత్రమే సాక్ష్యముగానో , రుజువుగానో మారజాలదు. మా అభిప్రాయము ప్రకారము ఈ కేసులో ఐ.పి.సి. లోని విభాగము 302/201 క్రింద శిక్షించుట జరగదు. మరియు హత్య చేయుటలో ఉద్దేశము గొర్రెలను దొంగిలించుటకే అని ఆరోపించబడినందున అప్పీలుదారుడు–ముద్దాయి దొంగతనము నేరము నుండి విడుదల పొందెను.

11. ఫలితముగా, వివాదాస్పద ఉత్తర్వులు కొట్టివేయబడినవి. అప్పీలు ఆమోదించబడెను. అప్పీలుదారుని హాజరు ఇతర కేసులలో అవసరమైతే తప్ప అప్పీలుదారునిపై మోపబడిన అన్ని నేరముల నుండి విముక్తి పొంది, విడుదల చేయబడవలెనని ఉత్తర్వులు జారీ చేయబడినవి.

ఆర్.భానుమతి
న్యాయమూర్తి

ఇందిరా బెనర్జీ
న్యాయమూర్తి

న్యూ ఢిల్లీ,
అక్టోబర్,11,2018.

**గమనిక :** స్థానిక భాషలో అనువధించబడిన తీర్పు , అతడు/ఆమె యొక్క స్థానిక భాషలో అర్థం చేసుకోవడానికి మాత్రమే పరిమితము. ఇది ఏ ఇతర ప్రయోజనాల కోసం ఉపయోగించరాదు. అనువదించిన స్థానిక భాష తీర్పు మూలమునకు ఆంగ్లమున గల తీర్పు ప్రామాణికమైనది.